క్లుప్తంగా

18న సాంబమూర్తి ఆలయ వార్షికోత్సవం

మునగపాక : మండల కేంద్రంలో ఈ నెల 18న సాంబమూర్తి దేవాలయ వార్షికోత్సవం ఘనంగా నిర్వహిస్తున్నట్టు ఆలయ చైర్మన్ బూడిద శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 5 గంటల నుంచి ఆలయ ప్రాంగణంలో స్వామి వారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరుగుతాయన్నారు. అదేరోజు మధ్యాహ్నం 12 గంటలకు ఆలయం వద్ద భారీ అన్న సమారాధన జరుగుతుందన్నారు. దీనిలో భాగంగా గురువారం ఉదయం 9 గంటలకు ఆలయం వద్ద స్వామివారి కళ్యాణ రాట వేస్తామన్నారు. గ్రామస్తుల సహకారంతో నిర్వహించే కార్యక్రమానికి భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని శ్రీనివాసరావు కోరారు.

వైద్యులను సంప్రదించాలి



వైద్య సేవలందిస్తున్న డాక్టర్ వెంకటేష్

రాంబిల్లి: దగ్గు, జ్వరం, జలుబు వంటి లక్షణాలుంటే వైద్యులను సంప్రదించాలని దిమిలి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ వెంకటేష్ సూచించారు. తమ పీహెచ్‌సీలో మందులు కొరత లేదన్నారు. వైద్యుల సూచనల మేరకు మందులు వాడాలన్నారు. విచ్చలవిడిగా యాంటీ బయోటిక్స్ వినియోగించవద్దని సూచించారు.

నాణ్యమైన ఆహారం అందించాలి



రికార్డులు పరిశీలిస్తున్న ఎంపీడీవో రవికుమార్

మునగపాక : పిల్లలకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలని ఎంపీడీవో పి.రవికుమార్ కోరారు. మండలంలోని పాటిపల్లి, మంగళవరపుపేటలోని అంగన్‌వాడీ కేంద్రాలను ఆయన బుధవారం సందర్శించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు మెరుగైన సేవలందించాలన్నారు. పోషక విలువలతో కూడిన ఆహారాన్ని అందించాలన్నారు. అనంతరం స్టాక్, రికార్డులు పరిశీలించారు. పంచాయతీ కార్యదర్శి మెహర్ పాల్గొన్నారు.

జాతీయ క్షయ నిర్మూలన ర్యాలీ



తిమ్మరాజుపేటలో ర్యాలీ

మునగపాక : ప్రతి ఒక్కరూ క్షయవ్యాధి సోకకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తిమ్మరాజుపేట సర్పంచ్ భీమిశెట్టి మంగలక్ష్మి కోరారు. తిమ్మరాజుపేటలో బుధవారం క్షయవ్యాధి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలు ఆరోగ్యం విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఉప సర్పంచ్ కాండ్రేగుల జగన్, హైస్కూల్ హెచ్ఎం సునీత,వైద్య సిబ్బంది కిన్నెర,ప్రేమకుమారి తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఈ నెల 19న మట్టి పాత్రల పంపిణీ

అనకాపల్లిటౌన్ : స్థానిక నెహ్రూచౌక్ బస్టాప్ వద్ద గ్రీన్ క్లబ్ ఆధ్వర్యంలో ఈ నెల 19న మట్టి పాత్రలనను పంపిణీ చేయనున్నట్టు క్లబ్ వ్యవస్థాపకుడు కొణతాల ఫణిభూషణ్ శ్రీధర్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. వేసవికాలంలో ఇళ్లపై, చెట్లపై వాలే పక్షులకు తాగునీరు, తిండిగింజలు ఏర్పాటు చేసేందుకు మట్టి పాత్రలు అందిస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ పక్షిజాతి మనుగడకు కృషి చేయాలని పేర్కొన్నారు.

నేటి నుంచి సీతారామ స్వామి బ్రహోత్సవాలు

నర్సీపట్నం: కొత్తబయపురెడ్డిపాలెంలో సీతారామ స్వామివారి ఆలయంలో గురువారం నుంచి 18వ తేదీ వరకు పదో వార్షిక బ్రహోత్సవాలు ఘనంగా నిర్వహించనున్నామని ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. 17న శ్రీనివాస కల్యాణం నిర్వహించనున్నామన్నారు.

తొలి రోజు పరీక్షలు ప్రశాంతం



నక్కపల్లిలో పరీక్ష కేంద్రం వద్దకు వెళ్తున్న విద్యార్థులు



యలమంచిలిలో పరీక్ష కేంద్రం నుంచి బయటకు వస్తున్న ఇంటర్మీడియట్ విద్యార్థులు

యలమంచిలి : ఇంటర్మీడియట్ పరీక్షలు బుధవారం నుంచి ప్రారంభమయ్యాయి. ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు తెలుగు హిందీ, సంస్కృతం, పరీక్షలు బుధవారం జరిగాయి. యలమంచిలి పట్టణంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల కొక్కిరాపల్లి గురుకుల కళాశాలలో పరీక్ష కేంద్రాలకు ఉదయం 8 గంటలకే విద్యార్థులు అధికశాతం హాజరయ్యారు. రెండు పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాల నిఘాలో నిర్వహించారు. యలమంచిలి పట్టణ ఎస్ఐ పాపినాయుడు ఆధ్వర్యంలో పరీక్ష కేంద్రాల వద్ద భద్రత ఏర్పాటు చేశారు. పరీక్ష కేంద్రాల వద్ద తాగునీరు, వైద్యసిబ్బందిని అధికారులు విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు కల్పించారు. బుధవారం మొదటి సంవత్సరం విద్యార్థులు 488 మందికి ఏడుగురు విద్యార్థులు గైర్హాజరైనట్టు యలమంచిలి ప్రభుత్వ కళాశాల చీఫ్ సూపరింటెండెంట్ డి.సరోజిని తెలిపారు.

నక్కపల్లి: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం ఇంటర్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. 542 మంది విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరయ్యారు. పరీక్ష కేంద్రాల వద్ద పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు జరిగాయి. ఎటువంటి మాస్ కాపీయింగ్ జరగకుండా పటిష్టమైన చర్యలు తీసుకున్నారు. కేంద్రాల వద్ద తాగునీరు, వైద్య శిబిరం ఏర్పాటు చేశారు

పాయకరావుపేట : పట్టణంలో ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. శ్రీ ప్రకాష్ జూనియర్ కళాశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల, కార్తికేయ జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నారు. శ్రీ ప్రకాష్‌కు చెందిన 510 మంది విద్యార్థులు, కార్తికేయ జూనియర్ కళాశాలకు చెందిన 419 మంది విద్యార్థులు, ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన 394 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నట్టు ఆయా కళాశాలల ప్రిన్సిపాల్స్ తెలిపారు.

28 మంది గైర్హాజరు

అచ్యుతాపురం(అనకాపల్లి): తొలి రోజు ఇంటర్ పరీక్షలు అచ్యుతాపురం మండలంలో ప్రశాంతంగా ముగిశాయి. మండలంలో ప్రశాంతి జూనియర్ కళాశాలలో ఇంటర్ పరీక్ష కేంద్రాన్ని కేటాయించారు. జిల్లా కలెక్టర్ రవి పటాన్‌శెట్టి పరీక్ష కేంద్రాన్ని బుధవారం సందర్శించారు. తొలి రోజు పరీక్షకు 314 మందిని కేటాయించగా, 28 మంది గైర్హాజరయ్యారని పరీక్ష కేంద్రం నిర్వాహకులు తెలిపారు. ఒక్క నిమిషం దాటి వచ్చిన విద్యార్థులను అనుమతించలేదు.



పరీక్షలు రాయడానికి పరీక్ష కేంద్రం వద్దకు హాజరైన విద్యార్థులు

ఘనంగా స్వామివారి పెళ్లిరాట



పెళ్లిరాట మహోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండలంలోని దుప్పుతూరులో ఈ నెల 22న నిర్వహించనున్న భద్రావతి సమేత భావనారాయణ స్వామి కల్యాణానికి సంబంధించి బుధవారం పెళ్లిరాట మహోత్సవం నిర్వహించారు. చేనేతలు, పద్మశాలీల ఆరాధ్య దైవమైన స్వామి వారి ఆలయంలో ఈ కల్యాణం నిర్వహించనున్నారు. సర్పంచ్ దేశంశెట్టి శంకర్‌రావు, ఎంపీటీసీ ద్వారంపురెడ్డి వెంకట లక్ష్మి బాబ్జి, సచివాలయం కన్వీనర్ కాసుబాబు, దేవస్థానం చైర్మన్ మాడెం సూరి అప్పారావు, చేనేత సంఘం చైర్మన్ నూకరత్నం, సంఘం మేనేజర్ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

యువత సన్మార్గంలో నడవాలి



జూనియర్ హైటెక్ సభ్యులతో ఏపీ గవర కార్పొరేషన్ చైర్మన్ ప్రసాద్

మునగపాక : యువత సమాజాభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఏపీ గవర కార్పొరేషన్ చైర్మన్ బొడ్డేడ ప్రసాద్ పిలుపునిచ్చారు. మంగళవారం రాత్రి మునగపాకలో జరిగిన పరదేశమ్మ తల్లి పండగ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడారు. చెడు వ్యసనాలకు గురికాకుండా కష్టపడి చదువుకోవడంతో పాటు అవకాశం ఉన్న చోట ఉపాధి పొందాలన్నారు. కార్యక్రమంలో పెంటకోట శివ గణేష్, విల్లూరి మోహన్, దాడి సూరిబాబు, జూనియర్ హైటెక్ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా నూకాంబిక జాతర మహోత్సవాలు



కోటవురట్ల: కె.వెంకటాపురంలో నూకాంబిక అమ్మవారి జాతర మహోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నట్టు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. జాతర సందర్భంగా ఈ నెల 13 నుంచి 22వ తేదీ వరకు పలు ఆటల పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. 17,18 తేదీల్లో వాలీబాల్ టోర్నీ, 19, 20 తేదీల్లో మహిళల కబడ్డీ పోటీలు, 21న అమ్మవారికి విశేష పూజలు, పలు సాంస్కృతిక కార్యక్రమాలు, 22న ముగ్గుల పోటీ నిర్వహించనున్నట్టు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.

జాబ్‌కార్డు కలిగిన అందరికీ పనులు కల్పించాలి



ఉపాధి సిబ్బందితో సమీక్ష చేస్తున్న ఎంపీడీవో

నక్కపల్లి : ఉపాధి కూలీల బ్యాంకు ఖాతాలకు ఆధార్‌ను అనుసంధానం చేయించాలని ఎంపీడీవో సీతారామరాజు సూచించారు. బుధవారం ఆయన ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లు, వీఆర్‌పీలతో సమీక్ష నిర్వహించారు. జాబ్‌కార్డు కలిగిన వారందరినీ పనుల్లోకి వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. వేసవి కాలంలో స్థానికంగా కల్పిస్తున్న ఉపాధి పనులను సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. ఉపాధి పనులకు హాజరవుతున్న కూలీలందరికీ బ్యాంకు ఖాతాలు తెరవడంతో పాటు, ఈ ఖాతాలకు ఆధార్ నంబరును అనుసంధానం చేయాలన్నారు. వేతన చెల్లింపులు నేరుగా బ్యాంకు ఖాతాల్లోనే జమ అవుతాయన్నారు. మస్టర్ల నమోదులో అక్రమాలు జరిగితే సహించేది లేదన్నారు. ప్రాధాన్యత పనులు తప్పనిసరిగా చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఏపీవో ఈశ్వరరావు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

గ్రావెల్ ట్రాక్టర్‌ను పట్టుకున్న పోలీసులు

నక్కపల్లి : మండలంలో దొండవాక సమీపంలో అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు పట్టుకున్నారు. ఎటువంటి అనుమతులు లేకుండా గ్రావెల్ తవ్వి తరలిస్తున్న విషయం తెలుసుకున్న పోలీసులు ట్రాక్టర్‌ను పట్టుకుని తహసీల్దార్‌కు అప్పగించారు. నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా గ్రావెల్ తరలిస్తే పట్టుకుని కేసులు నమోదు చేస్తామని ఎస్ఐ శిరీష హెచ్చరించారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో 22 మందిపై అపరాధ రుసుం



వాహనచోదకులకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్ఐ రమేష్

అనకాపల్లిటౌన్ : మద్యం సేవించి వాహనాలు నడిపిన 22 మంది వాహన చోదకులకు రెండో అదనపు న్యాయమూర్తి పి.వెంకటేశ్వర్లు రూ.64 వేలు అపరాధ రుసుం విధిస్తూ బుధవారం తీర్పునిచ్చారు. ట్రాఫిక్ ఎస్ఐ జె.రమేష్ అందించిన వివరాలు.. పట్టణ పరిధిలోని పలు ప్రాంతాల్లో మంగళవారం వాహనాల తనిఖీలో 22 మంది మద్యం సేవించి వాహనాలు నడుపుతున్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ మేరకు బుధవారం వారిని కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి అపరాధ రుసుం విధిస్తూ తీర్పునిచ్చినట్టు ఎస్ఐ వెల్లడించారు. అనంతరం వారికి కౌన్సిలింగ్ ఇచ్చారు.

17న సెబ్ స్టేషన్‌లో వాహనాల వేలం

యలమంచిలి : అక్రమంగా మద్యం, నాటు సారా తరలిస్తూ వివిధ కేసుల్లో పట్టుబడిన 8 వాహనాలను 17వ తేదీన యలమంచిలి సెబ్ కార్యాలయం వద్ద వేలం వేయనున్నట్టు యలమంచిలి సెబ్ సీఐ జనార్ధనరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ వేలంలో నాలుగు యాక్టివా స్కూటీలు, ఒక బజాజ్ ప్లాటినా మోటార్ బైక్, ఒక హీరో హోండా స్ప్లెండర్ ప్లస్ మోటార్ బైక్, ఒక బజాజ్ పల్సర్ మోటార్ బైక్, ఒక టీవీఎస్ ఎక్సల్ మోపెడ్ వాహనాలను వేలం వేస్తామని, ఆసక్తి గలవారు 16తేదీన రూ.3 వేలు ధరావత్తు రుసుము చెల్లించాలని తెలిపారు.

వినియోగదారుల హక్కులపై అవగాహన



విద్యార్థులకు వివరిస్తున్న ఉపన్యాసకులు

చోడవరం రూరల్: విద్యార్థి దశలో వినియోగదారుల హక్కులు, దానికి సంబంధించిన చట్టం పట్ల అవగాహన పెంచుకోవాలని ప్రిన్సిపాల్ కె.రామచంద్రరావు సూచించారు.

అంతర్జాతీయ వినియోగదారుల హక్కుల దినోత్సవం సందర్భంగా చోడవరం కన్స్యూమర్స్ క్లబ్, ఎన్ఎస్ఎస్‌ల ఆధ్వర్యంలో బుధవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య వక్తగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ వినియోగదారుల చట్టం ఏర్పాటు, హక్కుల గురించి వివరించారు. వైస్ ప్రిన్సిపాల్ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ వస్తువుల కొనుగోళ్లకే గాకుండా వివిధ రకాల సేవలను పొందే విషయంలోనూ వినియోగదారుల హక్కుల చట్టం వర్తిస్తుందని తెలిపారు. విద్యార్థులు సందేహాలను నివృత్తి చేశారు. సీనియర్ ఉపన్యాసకులు రఫీయుద్దీన్, సత్యనారాయణ, రాధాకృష్ణ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు మాల్యాద్రి, లక్ష్మీ, పిచ్చమ్మ పాల్గొన్నారు.

ఉచిత యోగా శిక్షణ కేంద్రం ప్రారంభం రేపు

అనకాపల్లిటౌన్ : గవరపాలెం పరమేశ్వరిపార్కు సమీపంలో ఉచిత యోగా శిక్షణ కేంద్రాన్ని ఈ నెల 17న ప్రారంభించనున్నట్టు స్వాభిమాన్ ట్రస్టు, పతంజలి యోగ సమితి జిల్లా అధ్యక్షుడు భీశెట్టి దొరమనాయుడు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. యోగా ద్వారా ఒత్తిడిని జయించేందుకు ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్టు పేర్కొన్నారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఉరుకులుపరుగులతోనే సరిపోతోందన్నారు. ప్రధానంగా మహిళలు రోజూ కనీసం గంట సమయాన్ని కేటాయించి ఉచిత యోగా శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

అన్ని దేవాలయాల్లో ఉగాది వేడుకలు

అనకాపల్లి టౌన్ : ఉగాది పర్వదినాన్ని అన్ని దేవాలయాల్లో ఘనంగా నిర్వహించాలని హిందూ సాంప్రదాయాల పరిరక్షణ సమితి సభ్యుడు ఆడారి కుమారస్వామి కోరారు. ఈ మేరకు జిల్లా దేవదాయ శాఖ అధికారి బుద్ధ మహాలక్ష్మినగేష్‌కు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ నెల 22న తెలుగు నూతన సంవత్సరాన్ని అత్యంత ఘనంగా స్వాగతిస్తూ, అన్ని దేవాలయాలకు మామిడి తోరణాలు, విద్యుత్ దీపాలంకరణ చేయాలని వినతిపత్రంలో పేర్కొన్నారు.

ఆ రోజు ఉగాది పచ్చడి అన్ని దేవాలయాల్లో పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు పి.సోమశేఖర్ పట్నాయక్, ఆళ్ల నాగేశ్వరరావు, కొడుకుల శ్రీకాంత్, కొణతాల హరనాథ బాబు, ఆడారి శ్రీనివాసరావు, పిట్ల లోకేష్ పాల్గొన్నారు.

ఘనంగా కాన్షీరాం జయంతి



కాన్షీరాం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దళిత నాయకులు

కశింకోట : స్థానిక ఎంఈవో కార్యాలయం వద్ద బుధవారం బీఎస్పీ అధినేత కాన్షీరాం జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బహుజన సమాజ్ పార్టీ ఏర్పాటు చేసి, మాయావతిని ముఖ్యమంత్రిగా చేసిన ఘనత కాన్షీరాంకు దక్కుతుందని వక్తలు కొనియాడారు. కార్యక్రమంలో సేవాస్తంబు రాష్ట్ర అధ్యక్షుడు కె.మోహన్ రాజు, దళిత నాయకులు వంకర వెంకటరావు, పి.సన్యాసిరావు, తట్టా కృష్ణ, చెవిటి అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

ఈ-పంట నమోదుతో బహుళ ప్రయోజనాలు



మాట్లాడుతున్న అరబుపాలెం సర్పంచ్ శ్రీనివాసరావు

మునగపాక : ఈ-పంట నమోదు చేసుకోవడం ద్వారా రైతులకు మేలు జరుగుతుందని అరబుపాలెం సర్పంచ్ బొడ్డేడ శ్రీనివాసరావు అన్నారు. అరబుపాలెం ఆర్‌బీకేలో బుధవారం ఈ-పంట నమోదు ఆడిటింగ్‌కు సంబంధిత గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈ-పంట నమోదు చేసుకోవడం వల్ల బహుళ ప్రయోజనాలు ఉంటాయన్నారు. వ్యవసాయాధికారి జోత్స్నకుమారి మాట్లాడుతూ గ్రామాల్లో జరుగుతున్న ఆడిటింగ్ సభలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వీఏఏ సత్య రవిరాజ్, రైతులు సమావేశంలో పాల్గొన్నారు.

క్షయ నివారణపై అవగాహన ర్యాలీ



పెనుగొల్లులో క్షయ నివారణపై ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

ఎస్.రాయవరం : క్షయ వ్యాధిగ్రస్తులు విధిగా ప్రభుత్వ సేవలు సద్వినియోగం చేసుకోవాలని పెనుగొల్లు పీహెచ్‌సీ వైద్యాధికారి రామ్‌నాయక్ అన్నారు. అంతర్జాతీయ టీబీ నివారణ దినోత్సవం పురస్కరించుకుని బుధవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి రామ్‌నాయక్ మాట్లాడుతూ ప్రభుత్వం గ్రామీణ వైద్యం, ఆరోగ్యం పట్ల అనేక సదుపాయాలు కల్పిస్తోందని దానిని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. గ్రామంలో ర్యాలీ నిర్వహిస్తూ టీబీ ఓడిపోతుంది.. దేశం గెలుస్తుంది..అంటూ నినాదాలు చేశారు. సూపర్‌వైజర్ ఆదినారాయణ క్షయ వ్యాధి లక్షణాలు వివరిస్తూ, నివారణకు జాగ్రత్తలు వివరించారు. కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

కష్టపడేవారికి సముచిత స్థానం ఉంటుంది..



రామారావు, రమేష్‌లను సత్కరిస్తున్న జెడ్పీటీసీ ఉమాదేవి, సత్యనారాయణ దంపతులు

కోటవురట్ల : పార్టీలో కష్టపడిన ప్రతి ఒక్కరికీ తగిన సమయంలో సముచిత స్థానం లభిస్తుందని జెడ్పీటీసీ సభ్యురాలు సిద్ధాబత్తుల ఉమాదేవి అన్నారు. కైలాసపట్నంలోని జెడ్పీటీసీ సభ్యురాలు ఉమాదేవి నివాసంలో ఉమ్మడి విశాఖ, విజయనగరం జిల్లాల వైఎస్సార్ సీపీ రైతు విభాగం జోనల్ ఇన్‌చార్జ్ చిక్కాల రామారావు, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు పైల రమేష్‌ను బుధవారం ఘనంగా సత్కరించారు. జెడ్పీటీసీ ఉమాదేవి మాట్లాడుతూ పార్టీ ఆవిర్భావం నుంచి చిక్కాల రామారావు, పైల రమేష్ నిబద్ధతతో పనిచేశారని, పార్టీ గుర్తింపు కోసం శ్రమించారని దాంతోనే అధిష్టానం ఈ విధంగా గౌరవించిందన్నారు. పార్టీ అభివృద్ధికి కృషి చేస్తూ మరిన్ని ఉన్నత పదవులను పొందాలని ఆకాంక్షించారు. చిక్కాల రామారావు, పైల రమేష్ మాట్లాడుతూ అందరి సహకారంతో పార్టీని ఎల్లవేళలా విజయపథంలో నడిపించేందుకు కృషి చేస్తామన్నారు. పార్టీ నాయకులు సిద్ధాబత్తుల సత్యనారాయణ, మాజీ సర్పంచ్ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్ష కేంద్రం సందర్శించిన కలెక్టర్

అచ్యుతాపురం(అనకాపల్లి): ఇంటర్ పరీక్ష కేంద్రమైన ప్రశాంతి జూనియర్ కళాశాలను బుధవారం జిల్లా కలెక్టర్ రవిపట్టాన్‌శెట్టి సందర్శించారు. అక్కడ పరీక్షలకు సంబంధించి ఏర్పాట్లు తిలకించారు. అనంతరం రెవెన్యూ కార్యాలయానికి వెళ్లి సిబ్బందితో మాట్లాడారు. రైతులు ఆనందంగా సేవలు పొందడమే ప్రభుత్వ ధ్యేయమని అన్నారు. రైతులకు పాస్ పుస్తకాలు, ఇతర సేవల కల్పనలో రెవెన్యూ యంత్రాంగం చొరవ చూపాలన్నారు.

అమలాపురంలో ఆధార్ సేవలు

నక్కపల్లి : మండలంలోని అమలాపురంలో బుధవారం ఆధార్ సేవలు ప్రారంభించారు. సచివాలయంలో ఏర్పాటు చేసిన ఆధార్ శిబిరాన్ని పీఏసీఎస్ అధ్యక్షురాలు సూరాకాసుల రామలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకుడు సూరాకాసుల గోవిందు పరిశీలించారు. ఇక్కడ ఏర్పాటు చేసిన ప్రత్యేక కేంద్రంలో ఆధార్ సమస్యలు పరిష్కరించడం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. బయోమెట్రిక్, ఆధార్ అనుసంధానం, అప్‌డేట్ సమస్యలతో వివిధ ప్రభుత్వ పథకాలకు లబ్ధిదారులు దూరమవుతున్నారని ప్రభుత్వం దృష్టికి రావడంతో సచివాలయ పరిధిలో నెలకొన్న ఆధార్ సమస్యలు పరిష్కరించేందుకు ఈ కేంద్రం ఏర్పాటు చేయడం జరిగిందని రామలక్ష్మి తెలిపారు. రెండు రోజుల పాటు ఈ శిబిరం కొనసాగుతుందని, సచివాలయ పరిధిలో అమలాపురం, మూలపర, పాటిమీద గ్రామాల వారు తమ సమస్యలు ఈ కేంద్రంలో పరిష్కరించుకోవాలని కోరారు.

విద్యార్థుల అభ్యాసంపై నిరంతర పర్యవేక్షణ అవసరం



పాఠశాలలో విద్యార్థులకు సూచనలు ఇస్తున్న ఏఎంవో లక్ష్మి

ఎస్.రాయవరం : ఎనిమిదో తరగతి విద్యార్థులకు ప్రభుత్వం అందజేసిన ట్యాబుల్లో బైజూస్ వినియోగం పరిశీలించడానికి అకడమిక్ మానిటరింగ్ అధికారి లక్ష్మి గోకులపాడు పాఠశాలను బుధవారం ఆకస్మికంగా తనిఖీచేశారు. ట్యాబుల ద్వారా బైజూస్ కంటెంట్‌లో లిప్ ప్రోగ్రామ్, టార్లా ప్రొగ్రామ్‌లను విద్యార్థుల ప్రదర్శనను చూసి సంతృప్తి వ్యక్తపరచారు. అనంతరం విద్యార్థుల వర్కుబుక్స్ నోట్ బుక్స్ కరెక్షన్స్ పరిశీలన చేశారు. ఉపాధ్యాయులు నిత్యం విద్యార్థుల చదువు, వర్కుబుక్స్ పరిశీలించాలని చెప్పారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు లావణ్యాలిజబెత్, సీఆర్‌పీ గోవింద్ పాల్గొన్నారు.

అమ్మవారి జాతరకు ప్రత్యేక ఏర్పాట్లు



ప్రత్యేక అలంకరణలో నూకాలమ్మ అమ్మవారు

నర్సీపట్నం: దేవదాయ శాఖ ఆధ్వర్యంలో పట్టణ ఇలవేల్పు నూకాలమ్మ అమ్మవారి జాతర ఘనంగా నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. ఏటా కొత్త అమావాస్య జాతర అత్యంత వైభవంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. అదే విధంగా ఈ ఏడాది అమ్మవారి జాతర బుధవారం నుంచి ప్రారంభమైంది. మంగళవారం రాత్రి అమ్మవారి మొదటి జాగారం, 17న రెండో జాగారం, 20న మూడో జాగారం, 21న అమ్మవారి జాతర నిర్వహించనున్నారు. ప్రత్యేక అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిస్తున్నారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు, ఆలయ కమిటీ వారు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. క్యూలైన్లు ఏర్పాటు చేశామని, భక్తులకు తీర్థ ప్రసాదం అందించేందుకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.